




ఎఎన్ఎం గ్రేడ్-3 సీనియార్టీ జాబితా ప్రకటించాలి

ప్రజాశక్తి-నెల్లూరు :గ్రామ/వార్డు సచివాలయంలో పనిచేయుచున్న ఎఎన్ఎం గ్రేడ్-3లకు సంబంధించి ప్రమోషన్లు పెండింగ్‌లో ఉన్నందున సీనియార్టీ జాబితాను సిద్ధం చేసి కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ విభాగానికి అందజేయాలని కోరుతూ ఏపి ఎన్‌జిఒ జిల్లా కమిటీ నాయకత్వం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టరు సుజాతకు వినతిపత్రం అందజేశారు. బుధవారం నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని డిఎంఅండ్‌హెచ్ఒ ఛాంబర్‌లో ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎం.పెంచలరావు ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని కలిసి సమస్యను వివరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 25 తేదీన కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ మంగళగిరి వారు అన్ని జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు.


వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

అగ్రిగోల్డ్ ఆస్తులపై అధికారుల మౌనం...!

◆ చక్రం తిప్పుతోన్న టిడిపి ఉదయగిరి నేతలు
◆ 'కనియంపాడు'లో బాధితులు ఆగ్రహం
◆ చెట్లనూ వదలని 'అధికారం'

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

అగ్రిగోల్డ్ సంస్థ రాష్ట్రవ్యాప్తంగా పేద, సామాన్య మధ్య తరగతి ప్రజలను మోసం చేసి కోట్ల రూపాయలను కొల్లగొట్టింది. అప్పట్లో జిల్లా వ్యాప్తంగా సుమారు 200 కోట్లు పేద, మధ్య తరగతి జనం నుంచి వసూళ్ళు చేశారు. ఆ మొత్తంలో కొంత ఖర్చుపెట్టి చిన్న చిన్న వ్యాపారాలు మొదలు పెట్టారు. అందులో భాగంగానే 15 సంవత్సరాల క్రితం జామాయిల్ (యూకలిప్టస్) మొక్కలు నాటారు. ఒక్క ఉదయగిరి నియోజకవర్గంలోనే వందలాది ఎకరాల వరకు కొనుగోళ్లు చేసినట్టు సమాచారం. అందులో వచ్చే ఆదాయం లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని ప్రకటించారు. "అగ్రిగోల్డ్ బోర్డు తిప్పేస్తుంది" అని నెల్లూరు నుంచే 'ప్రజాశక్తి' తొలుత కథనం ప్రచురించింది. దీనిని అగ్రిగోల్డ్ సంస్థ, కొందరు కాదని చిలకపలుకులు చెప్పారు. చిన్నగా అగ్రిగోల్డ్ మోసం బయటపడిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రులు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, చంద్రబాబునాయుడు, వైఎస్‌జగన్, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి అందరూ న్యాయం చేస్తామని ప్రకటించారు. కొద్ది మందికి మాత్రమే అతికష్టంపై నగదు చెల్లించారు. ఇటీవల ప్రభుత్వం అగ్రిగోల్డ్ ఆస్తులను అటాచ్ చేసుకుంది. ప్రస్తుతం ప్రభుత్వ ఆధీనంలో భూములు, భవనాలు, ఇతర ఆస్తులు ఉన్నాయి.

అధికారులు ప్రభుత్వ ఆస్తులను అధికారపార్టీ నేతల చేతుల్లో పెడుతున్నారనే విమర్శలున్నాయి. ఇప్పటికే అడ్డూ అదుపు లేకుండా ఇసుక, గ్రావెల్, మైనింగ్ అక్రమణ చేసుకుంటున్నారు. ప్రభుత్వ ఆస్తులు ఎక్కడుంటే అక్కడ లెక్కలు సరిచేస్తున్నారు. ఇటీవల బదిలీల్లో రెవెన్యూ, పోలీసులతో పాటు అన్ని శాఖల అధికారులను స్థానిక ఎంఎల్ఎల సిఫార్సులతోనే పోస్టింగులు ఇచ్చారు. ఎంఎల్ఎల దయాదాక్షిణ్యాలతో పోస్టింగులు తెచ్చుకున్న అధికారులు నమ్మిన బంటులా అధికారపార్టీ నేతలకు సేవ చేస్తున్నారనే విమర్శలు మూటగట్టుకుంటున్నాయి. గత కొన్నేళ్లుగా ..పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలను మోసం చేసి అగ్రిగోల్డ్ సంస్థ భారీగా దోపిడీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా అగ్రిగోల్డ్ ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఆస్తులను రెవెన్యూ, పోలీసు అధికారులు కాపాడాల్సిన అవసరం ఉంది. ఇక్కడ మాత్రం అధికారపార్టీ నేతల చేతుల్లో పెట్టి కొందరు అధికారులు కమలహాసన్‌ను మించి నటిస్తు న్నారు.

'కనియంపాడు' భూములు అగ్రిగోల్డ్ వే..!

ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడు మండలం, కనియంపాడు అగ్రిగోల్డ్ భూములను కాపాడాలని బాధితులు, సిపిఐ నాయకులు అధికారులను కోరారు. బుధవారం కనియంపాడు గ్రామంలో పర్యటించిన వారు అక్కడ వాస్తవ పరిస్థితులు చూశారు. పెద్ద పెద్ద చెట్లను తొలగించిన ఆనవాళ్ళు అక్కడే పరిశీలించారు. అనేక చోట్ల చెట్లను కొట్టి , తరలించారు. ఇవి అగ్రిగోల్డ్ భూములకు సంబంధించిన చెట్లు, ఆస్తులేనని గమనించారు. స్థానిక తహశీల్దారుకు వినతి పత్రం అందజేశారు. బాధితులు తమకు చెందిన ఆస్తుల అధికారపార్టీ నేతలు దోచుకుంటుంటే అధికారులు కళ్లు మూసుకొని వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్యతోపాటు అగ్రిగోల్డ్ బాధితులు అధికారులను కలిశారు. ఇలాగే వదిలేస్తే కోట్ల రూపాయల ఆస్తి మొత్తం అధికారపార్టీ నేతలు దోచుకుపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని వాస్తవాలు తెలుసుకొని ప్రభుత్వ , ప్రజల ఆస్తి కాపాడుతారని కోరుతున్నారు.


వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఐ నాయకులు


కనియపాడులో మరలా చెట్లు నరికివేసిన దృశ్యం


మంత్రి ఆనంను కలిసిన కలెక్టర్ ఆనంద్

మంత్రి 'ఆనం'ను కలిసిన కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు

రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలెక్టర్ ఆనంద్ మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయానికి విచ్చేసిన కలెక్టర్ ఆనంద్‌తో మంత్రి ఆనం పలు విషయాలపై చర్చించారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మంత్రికి కలెక్టర్ వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వేగవంతం చేసి ప్రజలకు త్వరగా చేరువయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు మంత్రి సూచించారు. జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేయాలని కోరారు. జిల్లాలో పథకాల అమలులో ఎదురవుతున్న సమస్యలు, పెండింగ్ పనులు, సోమశిల ప్రాజెక్టు సంబంధిత పనులు, ఆత్మకూరు నియోజకవర్గంలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాలు తదితర అంశాలపై చర్చించారు. ప్రధానంగా విద్యారంగంలో రానున్న నూతన విధానాలపై చర్చించారు. ఈ సందర్భంగా సోమశిల ప్రాజెక్టు చైర్మన్ కేశవ చౌదరి, కలెక్టర్‌ను శాలువాతో సన్మానించారు.



'బుర్రా'సత్కారం

ప్రజాశక్తి-కందుకూరు

మాజీ శాసనసభ్యులు ,కందుకూరు నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్‌ని వలేటివారిపాలెం మండల వైసిపి అధ్యక్షులు అనుమోలు లక్ష్మినరసింహం బుధవారం కలిసి ఘనంగా సత్కరించారు.తనపై నమ్మకంతో అధ్యక్షుడుగా నియమించినందుకు బుర్రాకు కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు కనీస మద్దతు ధర లభించేలా పర్యవేక్షణ


మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

ప్రజాశక్తి-నెల్లూరు:జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర తగ్గకుండా విక్రయించుకునేలా వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. బుధవారం కలెక్టరు తన చాంబర్‌లో వ్యవసాయ అనుబంధశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా త్వరలో మొదలు కానున్న ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర దక్కేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. ఈక్రాప్‌ను ఈనెల 25లోగా పూర్తి చేయాలన్నారు. సిసిఆర్‌సి కార్డులు పొందిన కౌలురైతులకు అవసరమైన బ్యాంకు రుణాలను మంజూరు చేయించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా జిల్లా సహకారశాఖ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన ప్రాథమిక వ్యవసాయ కోపరేటివ్ సొసైటీల్లో పురుగుమందు రహిత వ్యవసాయ ఉత్పత్తుల స్టాళ్ల ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. త్వరలో దగదర్తిలోని పిఎసిఎస్‌లో పురుగుమందు రహిత వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను ఏర్పాటు చేయనున్నట్లు డిసిఒ గుర్రప్ప కలెక్టర్‌కు తెలిపారు. పైలెట్ ప్రాజెక్టుగా మార్కెటింగ్‌శాఖ పరిధిలో ఒక గోడౌన్, సహకారశాఖ ఆధ్వర్యంలోని ఒక గోడౌన్‌ను జాతీయ గోదాముల అభివృద్ధి ప్రాధికార సంస్థ, న్యూఢిల్లీ వారి గుర్తింపు పొందేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. దీని ద్వారా రైతులకు ఎన్నో ఉపయోగాలున్నాయని కలెక్టర్ చెప్పారు. విడతలవారీగా అన్ని గోడౌన్లకు ఈ గుర్తింపు లభించేలా చర్యలు చేపట్టాలని మార్కెటింగ్, సహకారశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఐదువేల హెక్టార్లలో డ్రిప్ ఇరిగేషన్ లక్ష్యంగా కాగా ఇప్పటికే మూడువేల ఎకరాల్లో డ్రిప్ పరికరాలు అమర్చినట్లు ఎపిఎంఐపి పిడి శ్రీనివాసులు కలెక్టర్‌కు వివరించారు. మిగిలిన 2వేల ఎకరాల డ్రిప్ పరికరాల ఏర్పాటు లక్ష్యాన్ని త్వరగా అధిగమించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి, మత్స్యశాఖ జెడి నాగేశ్వరరావు, పశుసంవర్ధకశాఖ జెడి రమేష్‌నాయక్, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సుబ్బారెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ మాలకొండయ్య, మార్కెటింగ్‌శాఖ ఎడి అనిత, మార్క్‌ఫెడ్ డిఎం పవన్‌కుమార్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి-వలేటివారిపాలెం: గర్భిణులు, బాలింతలు పోషక విలువలు కలిగిన పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత తెలిపారు. మండలం లోని బండివారిపాలెం అంగన్వాడీ కేంద్రంలో బుధవారం గర్భిణులు, బాలింతలకు, పిల్లలకు పౌష్టికాహారంపై అవగాహన కార్యక్ర మం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ సునీత మాట్లాడుతూ పౌష్టికాహారంతోనే ఆరోగ్యం లబిస్తుందనీ తెలిపారు. కార్యక్రమంలో కార్యకర్త వరలక్ష్మి, గర్భిణులు, బాలింతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-సైదాపురం

యువత సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ శివకుమార్ తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది సహాయంతో లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుల పరిశీలన అనర్హులని తెలిస్తే.వారి స్థానంలో మరొకరికి అవకాశం కల్పిస్తామని తెలిపారు.దరఖాస్తులు, డాక్యుమెంటేషన్ కోసం బ్యాంకుల చుట్టూ తిరగకుండా ఎంపీడీఓ కార్యాలయాల్లో ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నామని పేర్కొన్నారు. యూనిట్ ఏర్పాటుకు సంబంధించిన పత్రాలు బ్యాంకుకు సబ్‌మెంట్ చేసిన వెంటనే లబ్ధిదారుల సబ్సిడీ మొత్తాన్ని ప్రభుత్వం బ్యాంకులకు జమ చేస్తుందని పేర్కొన్నారు. అనంతరం రాయితీ, బ్యాంకు లోన్ మొత్తం లబ్ధిదారుడి ఖాతాలు జమ చేస్తారని తెలిపారు. యూనిట్లు మంజూరైన అనంతరం లబ్ధిదారులు రుణాలు తిరిగి చెల్లింపును గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందిలో ఒకరికి పర్యవేక్షిస్తుంటారని తెలిపారు.21 నుంచి 60 ఏళ్ల మధ్య వయసున్న వారు స్వయం ఉపాధి రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. మినీ డెయిరీ యూనిట్లు, గొర్రెలు, మేకల పెంపకం, కుమ్మరి, కుటుంబాలు, వడ్రంగి పనివారికి రుణాలు, జనరిక్ మందుల షాపులు ఏర్పాటుకు రుణాలు అందిస్తారని తెలిపారు. దరఖాస్తు చివరి తేదీ పొడిగింపుబడదు ఈనెల 7వ తేదీ లోపు యువత సకాలంలో రుణాల కోసం ఎస్‌సి, బిసి, కాపు, కమ్మ, వైశ్య యువత దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

బీమాను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

తపాలా శాఖ అమలు చేస్తున్న జీవితాబీమాను సద్విని యోగం చేసుకోవాలని నెల్లూరు డివిజన్ హెడ్ క్వార్టర్స్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎస్. ఆర్. కె. హెచ్. ప్రసా ద్ పేర్కొన్నారు.నెల్లూరు ఈస్ట్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ సోంపల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం బ్రాహ్మదేవం ఉప తపాలా కార్యాలయం లో గ్రామీణ పోస్టల్ ఉద్యోగులతో ఆయన అవగాహనా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాలా శాఖలో మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్, సేవింగ్స్, సుకన్య సమృద్ధి యోజన, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, ఐపిపిబి బ్యాంకింగ్ సేవలు, స్టాంప్స్ కలెక్షన్,మెయిల్స్, పార్సెల్ వంటి అద్భుత పథకాలు ఉన్నాయన్నారు. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలను భాగస్వామ్యులను చేయాలని సూచించారు. సబ్ డివిజన్ స్థాయి గ్రామీణ తపాలా ఉద్యోగులు పోస్టల్ సేవలను గురించి ప్రజలకు వివరించాలని తెలిపారు. సోంపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ తపాలా జీవిత బీమాను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.కార్యక్రమంలో సబ్ పోస్టు మాస్టరులు ఎం.కృష్ణారావు, వై.రాంబాబు, మెయిల్ ఓవర్ సీర్ సిహెచ్.వెంకయ్య, జి.డి.ఎస్.స్టాఫ్, స్థానికులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి-కందుకూరు:పట్టణంలో జిఎస్‌టి విజిలెన్స్ అధికారుల బృందం పలు దుకాణాలను ఆకస్మికంగా తనిఖీలు చేసింది. బుధవారం పట్టణానికి వచ్చిన జిఎస్‌టి విజిలెన్స్ టీమ్ అధికారులు పట్టణంలోని విష్ణుప్రియ లాడ్జి వద్ద ఉన్న హోల్‌సేల్సే బియ్యం దుకాణాన్ని తనిఖీ చేశారు. తనిఖీ చేసిన సందర్భంలో ఆయుర్వేద వస్తువులను లైసెన్స్ లేకుండా విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిసింది. పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లోని ఓ డ్రై ఫ్రూట్స్ షాపును కూడా విజిలెన్స్ టీం అధికారులు తనిఖీలు చేశారు. విజిలెన్స్ టీం వచ్చినట్లు సమాచారం రావడంతో పట్టణంలోని వివిధ వ్యాపార సంస్థలకు తలుపులు వేసి యజమానులు వెళ్లిపోవడం కనిపించింది.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి-లింగసముద్రం

మండల కేంద్రమైన లింగసముద్రం గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకులు కిలారి సుబ్బరాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు.బుధవారం జరిగిన దశదిన ఖర్మకు కందుకూరు మాజీ శాసనసభ్యులు మానుగుంట మహీదర్ రెడ్డి హాజరై సుబ్బరాయుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సుబ్బరాయుడు కుమారులు మాధవ, మల్లికార్జున లతో మాట్లాడి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అదేవిధంగా మండల పరిషత్ అధ్యక్షులు పెన్నా కృష్ణయ్య,మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ షఫీ,యర్రారెడ్డిపాలెం గ్రామ సర్పంచ్ డబ్బుగొట్టు మల్లికార్జున, వైసిపి మాజీ మండల కన్వీనర్ పిచ్చపాటి తిరుపతిరెడ్డి, మండల జెసిఎస్ కన్వీనర్ వరికూటి కృష్ణారెడ్డి, లింగసముద్రం మాజీ సర్పంచ్ మాచేపల్లి మాల్యాద్రి,సుబ్బరాయుడు కి నివాళులర్పించారు.


నివాళి అర్పిస్తున్న మానుగుంట


కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఆవాజ్ నాయకులు

మైనారిటీ బాలికల గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు

నగరంలో మైనారిటీ బాలికల గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలని కోరుతూ ఆవాజ్ జిల్లా కమిటీ కలెక్టర్ ఒ ఆనంద్‌కు వినతిపత్రం అందజేసింది. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో కలిసిన ఆవాజ్ జిల్లా కమిటీ 4 అంశాలను వివరించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపాలని కోరింది. అనంతరం ఆవాజ్ జిల్లా కమిటీ నాయకులు మీడియాతో మాట్లాడుతూ ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న మోడల్ స్కూల్స్ లో ఉర్దూ మీడియం పాఠశాలలను విలీనం చేయొద్దని, ప్రతి మోడల్ స్కూల్లో ఇద్దరు ఉర్దూ ఉపాధ్యాయులను నియమించాలని కోరామన్నారు. ఉర్దూ భాష అంతరించ పోకుండా కాపాడాలని కలెక్టర్‌ను కోరామన్నారు. జిల్లాలో మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలను జిల్లా లో ఏర్పాటు చేయాలని, ప్రస్తుత అక్కచెరువుపాడు లో ఉన్న మైనారిటీ గురుకుల పాఠశాల కు రోడ్లు వేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, భారత రత్న అయిన డాక్టర్ జాకీర్ హుస్సేన్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలు ప్రభుత్వం నిర్వహించాలని, వెంకటేశ్వరపురం లో ఉన్న ఆయన విగ్రహం వద్ద కాంపౌండ్ కి దెబ్బ తిన్న గేట్లు పెట్టించాలని కోరామన్నారు. ఆవాజ్ జిల్లా కమిటీ నాయకుల చేసిన విజ్ఞప్తిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్, ఆవాజ్ సీనియర్ నాయకులు షేక్ రియాజ్, జిల్లా కమిటీ సభ్యులు షేక్ అన్వర్ లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారి

పలుచోట్ల పొలంపిలుస్తోంది.

.ప్రజాశక్తి-గుడ్లూరు రూరల్

మండలంలోని సాలిపేట, మోచర్ల రైతు సేవా కేంద్రాల పరిదిలోని గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి బి. రవికుమార్ అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్య క్రమాన్ని నిర్వహిం చారు. వ్యవసాయ శాఖ, అనుబంధ రంగాలు పొలం పిలుస్తోంది వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ విస్తరణ కార్యక్రమాన్ని నిర్వహిం చారు.ఈకార్యక్రమంలో మెడ విరుపు తెగులు నివారణ చర్యల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామ వ్యవసాయ/ఉద్యాన సహాయకులు షారూఖ్, ఝాన్సీ, వెంకటేశ్వర రెడ్డి, రైతులు పాల్గొన్నారు.


ప్రజాశక్తి-వలేటివారిపాలెం

మండలంలోని కలవల్ల గ్రామంలో మండల వ్యవసాయాధికారి ఎం. హేమంత్ భరత్ కుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు, ఎం.హేమంత్ భరత్ కుమార్ మాట్లాడుతూ రైతులు అందరూ గ్రామ రైతు సేవా కేంద్రాలలో సంబధిత గ్రామ వ్యవసాయ,ఉద్యానవన సహాయకులు ద్వారా రబీ సీజన్లో వేసిన అన్ని పంటలకు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని కోరారు. తద్వారా రాబోయే రోజుల్లో ప్రభుత్వం ద్వారా పంట నష్ట పరిహారం, ఇన్సూరెన్స్, అన్నదాత సుఖీభవ వంటి సంక్షేమ కార్యక్రమాలు, కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముకొనుటకు అవకాశం ఉందని తెలియజేశారు.కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు పి. శ్రీకాంత్ రెడ్డి; గ్రామ రైతులు పాల్గొన్నారు.


మాజీ ఎంపి ఆదాల , మాజీ ఎంఎల్ఎ మానుగుంట

తాజా రాజకీయాలపై చర్చ

ప్రజాశక్తి-కందుకూరు: కందుకూరు మాజీ శాసనసభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డితో మాచవరంలోని ఆయన నివాసంలో నెల్లూరు పార్లమెంట్ మాజీ సభ్యులు ,నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు ఆదాల ప్రభాకర్ రెడ్డి బుధవారం మధ్యాహ్నం భేటీ అయ్యారు. తాజా రాజకీయ పరిస్థితులు, ఇంకా పలు అంశాలపై ఇద్దరిమధ్య చర్చ జరిగినట్టు సమాచారం. కొంతకాలంగా వైసీపీకి దూరం పాటిస్తున్న మహీధర్ రెడ్డితో ఆదాల ప్రభాకర్ రెడ్డి సమావేశం కావడం ఆసక్తికరంగా మారింది.వారిద్దరి మధ్య జరిగిన చర్చలు స్పష్టంగా తెలియలేదు. ఈ భేటిలో కొండ్రెడ్డి రంగారెడ్డి, పలువురు నేతలు ఉన్నారు.


నివాళి అర్పిస్తున్న వైసిపి నాయకులు

మడపర్తి రవీంద్రకు పితృవియోగం

ప్రజాశక్తి-విడవలూరు

కోవూరు మండల ఆంధ్రజ్యోతి విలేకరి మడపర్తి రవీంద్ర తండ్రి రిటైర్డ్ హెడ్మాస్టర్ మడపర్తి రామకష్ణయ్య బుధవారం మృతిచెందారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ అధ్యక్షులు దొడ్డం రెడ్డి నిరంజన్ బాబు రెడ్డి, పడుగు పాడు మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు రామిరెడ్డి మల్లికార్జున్ రెడ్డిలు విడవలూరు లోని వారి స్వగృహానికివెళ్లి రామకృష్ణయ్య పార్థివ దేహానికి పూలమాలలు వేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

దాడిచేసిన వారిపై కేసు నమోదు చేయాలి


ప్రజాశక్తి-కందుకూరు: గత నెల 29వ తేదీ కందుకూరు పట్టణం పోస్ట్ ఆఫీస్ దగ్గర గల ఈతముక్కలమ్మ దేవాలయం వద్ద యువకుడిపై కొందరు దాడి చేసిన సంఘటన విధితమే. దాడి చేసిన ఏకాంబరం, మస్తాన్ పై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా యాదవ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు మిరియం శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షులు చిరుమామిళ్ల గోపి కృష్ణ యాదవ్ తెలిపారు.

వైసిపి నాయకులు కార్యకర్తలతో 'బుర్రా' భేటీ

ప్రజాశక్తి-కందుకూరు

మాజీ శాసనసభ్యులు కందుకూరు నియెజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ బుధవారం వైసిపి కార్యాలయంలో వివిధ మండలాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలతో భేటి అయ్యారు. మధుసూదన యాదవ్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని సమస్యలు అడిగి తెలుసుకు ఒన్నారు. నియోజకవర్గంలోని తాజా పరిస్థితుల గురించి ఆరా తీశారు.

కాకాణిపై రూప్‌కుమార్ ధ్వజం


మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్

ప్రజాశక్తి-నెల్లూరు:వైసిపి నాయకత్వం లోపం..అసమర్ధత వల్లనే ఆ పార్టీ గుర్తుతో కార్పొరేటర్లుగా గెలుపొందిన వారు టిడిపి వైపు అడుగులు వేశారంటూ మాజీ మంత్రి , ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసిపి అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పై డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ ధ్వజమెత్తారు. బుధవారం నగరంలోని డిప్యూటీమేయర్ క్యాంపు కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గడిచిన రెండు రోజుల క్రితం జరిగినటువంటి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నిక, కోవూరు నియోజ కవర్గం బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ రెండు వైస్ చైర్ పర్సన్ ల ఎన్నికకు సంబంధించి మాజీ మంత్రివర్యులు జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి, కోవూరు నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నగర నియోజకవర్గం ఇన్‌ఛార్జి పర్వతనేని చంద్రశేఖర్ రెడ్డి ఇతర కొంతమంది చోట నాయకులు విలేకర్ల సమావేశంలో మాట్లాడిన విధానాన్ని తప్పు పట్టారు. మేమందరం ఎవరైతే టిడిపికి మద్దతు ఇచ్చి ఆ పార్టీలో ఉండి డిప్యూటీ మేయర్ గా నగర కార్పొరేషన్ నుంచి సోదరి తహసీన్‌ని, బుచ్చిరెడ్డిపాలెం లో ఇద్దరు మున్సిపల్ చైర్ పర్సన్‌లను తాము మనస్ఫూర్తిగా ఎన్నుకున్నామన్నారు.కొంతమంది ఎన్నికలకు ముందే టిడిపి లో చేరమన్నారు. మరి కొంతమంది కార్పొరేటర్లు, కౌన్సిలర్లు టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత వారి వారి ప్రాంతాల అభివృద్ధి కోసం ఆ పార్టీలో చేరడం జరిగిందన్నారు. గోవర్ధన్ రెడ్డి నగరంలో గాని బుచ్చిరెడ్డిపాలెం లో గాని మాటకు ముందు రాజ్యాంగం పదవ షెడ్యూలు, కేరళ హైకోర్టు ఒక కాగితపు ముక్క తీసుకొని అబద్ధపు మాటలు పలకడం సరికాదన్నారు.పెద్దలు గోవర్ధన్ రెడ్డి తెలుసుకోవలసిన విషయాలు చాలా ఉన్నాయన్నారు.కార్పొరేషన్ లో 54 కార్పొరేటర్లకు గాను దాదాపు 45 మంది కార్పోరేటర్లు తెలుగుదేశం పార్టీలోకి వెళ్లారంటే ఇది మీ అసమర్థత కాదా అని అడుగుతున్నన్నారు. 20 మంది కౌన్సిలర్లు ఉన్నటువంటి బుచ్చి నగర పంచాయతీలో దాదాపు 14 మంది మీ వైపు లేకుండా వెళ్లిపోయారంటే కారణం ఏంటో ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకోమన్నారు. చంద్రశేఖర్ రెడ్డి కాలేజీలు వేరు ఇన్స్టిట్యూషన్స్ వేరు కేవలం 20 వేల ఓట్లు ఉన్న టీచర్స్ ఎలక్షన్స్ లో నువ్వు ఏ విధంగా గెలిచావో అన్ని తెలిసిన వాడినన్నారు. ఆ ఎన్నికలు వేరు ప్రత్యక్ష ఎన్నికలు వేరు ప్రజలచే ఎన్నుకోబడ్డం వేరన్నారు. మేమందరం టిడిపిలో చేరాం గర్వంగా చెప్తున్నాం చంద్ర బాబు, లోకేష్ బాబు నాయకత్వంలో పనిచేయడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ తహసీన్ ఇంతియాజ్, సీనియర్ నాయకులు దార్ల వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు అస్మా మైనుద్దీన్, దేవరకొండ సుజాత అశోక్, గోగుల నాగరాజు, నాయకులు నిశ్చల్ కుమార్ రెడ్డి, అల్లంపాటి జనార్దన్ రెడ్డి, ఊటుకూరు చంద్ర పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



ప్రజాశక్తి-కందుకూరు: ఆంధ్రప్రదేశ్ ప్రయివేట్ యునైటెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో జరిగిన టాలెంట్ టెస్టులో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థిని షేక్ హీనను అభినందించారు. బుధవారం జరిగిన సభలో నాగార్జున పాఠశాల కరస్పాండెంట్ షాలినిరెడ్డి మాట్లాడుతూ చదువు లలో మరింత ఉన్నత స్థానానికి చేరుకోవాలని హీనాను ఆ శీ ర్వ ది స్తూ , ప్రో త్స హి స్తు న్న తల్లిదండ్రులకు,ఉన్నతచదువులు బోధిస్తున్న ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు డి.బాలబ్రహ్మం మాట్లాడుతూ నాగార్జున స్కూలు విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తుందన్నారు. అభినందన కార్యక్రమంలో మర్రెడ్డి, కె.శ్రీనివాసరావు, అహ్మద్ బాషా, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా అంగన్‌వాడీ కేంద్రంలో ఇసిసిఇ డే

ప్రజాశక్తి-కందుకూరు

:మండలంలోని మాచవరం అంగన్‌వాడీ నాలుగో సెంటర్ లో పూర్వ బాల్య దశ సంరక్షణ, విద్య(ఎర్లీ చైల్డ్ హుడ్ అండ్ కేర్ ఎడ్యుకేషన్) దినోత్సవ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న కందుకూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ శర్మిష్ట అంగన్‌వాడీ కేంద్రానికి విచ్చేసిన తల్లిదండ్రులకు చిన్నారుల ప్రతిభను గురించి వివరించారు. ప్రాథమిక విద్య, పిల్లల సమగ్ర అభివృద్ధి, సంరక్షణ అందరికీ సాధ్యమైనంత తొందరగా అందించడమే ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశ మన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ప్రభావతి, అంగన్‌వాడీ వర్కర్లు ,హెల్పర్లు, ఎఎన్ఎం విజయలక్ష్మి, వరల్డ్ విజన్ సిబ్బంది, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-కోవూరు : చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ సారథ్యంలో టిడిపి కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధికి నోచుకుంటున్నాయని ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండలంలోని పడుగుపాడు డిగ్రీ కళాశాలలో రూ.6లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్డును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె కోవూరు నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తావిస్తూ వైకాపా అండ్ ఆర్ కళాశాల ఇంగ్లిష్ లెక్చరర్ హరిప్రసాద్ రచించి గాయకులు శ్యామలరావు ఆలపించిన పాటకు విద్యార్థులు ఉత్సాహంగా కేరింతలు కొట్టారు. అనంతరం ఎంఎల్ఎ సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మి ప్రసూన, తహశీల్దార్ నిర్మలానంద బాబా, ఎంపిడిఒ శ్రీహరి రెడ్డి, పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాల్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు తిరుమూరు అశోక్ రెడ్డి, టిడిపి జిల్లా కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు ఇంతా మల్లారెడ్డి, ఎంపిపి పార్వతి, జెడ్‌పిటిసి శ్రీలత, పోతిరెడ్డి పాలెం ఎంపిటిసి యద్దలపూడి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

దొంగలు అరెస్టు

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని పలు ఆలయాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను చుంచులూరు కూడలి వద్ద పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్లో ఆత్మకూరు సిఐ గంగాధరరావు, ఎస్ఐ శ్రీనివాస రావు వివరాలను బుధవారం పత్రిక విలేకరులకు వెల్లడించారు. వారి వద్ద నుండి రూ.6వేలు చోరీ సొత్తును, చోరీకి ఉపయోగించిన ప్యాషన్ ప్రొ మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను కోర్టుకు హాజరు పరిచామన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు పరిశీలన

ప్రజాశక్తి-ఉదయగిరి : తరచూవచ్చే వ్యాధుల పట్ల సిబ్బంది చేపడుతున్న వ్యాధి నిరోధక టీకాను గండిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం.శివలక్ష్మన పరిశీలన చేశారు. ఈ సందర్భంగా బుధవారం గండిపాలెం పిహెచ్‌సి పరిధిలో గర్భిణులకు చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎన్ఎంలు చిన్నారులల్లో వచ్చే ప్రాణాంతక వ్యాధుల నుండి కాపాడుటకు టీకాలు ఎంతో ముఖ్యమని తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు వెన్నయ్య, అంకమ్మ, ఎఎన్ఎంలు నూర్జహాన్, పద్మావతి, ఎలిజబెత్, జమ్మయమ్మ, ఆదెమ్మ, స్వాతి, దేవి, గిరిజ, ఆరోగ్య సహాయకులు శ్రీనివాసులు, అనసయ, మస్తాన్ అలీ, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'జాతీయరంగంలో పాడిపరిశ్రమ'

ప్రజాశక్తి-కావలి : జవహర్ భారతి డిగ్రీ కళాశాల డెయిరీ సైన్స్ విభాగంలో "జాతీయ రంగంలో పాడి పరిశ్రమ : ఒక పరిశీలన" అనే అంశంపై డాక్టర్ ఆర్.మల్లికార్జునరెడ్డి అతిథి ఉపన్యాసించారు. వారు జవహర్ భారతి డెయిరీ సైన్స్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్‌గా పనిచేసి, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును స్వీకరించి ఉన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం నాయుడు మాట్లాడుతూ నిత్యజీవితంలో ప్రతిఒక్కరికీ అవసరమైన పాలు, పాల ఉత్పత్తులకు సంబంధించి ప్రతి ఒక్క విద్యార్థి కనీస అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమానికి జవహర్ భారతి స్వయం ఉపాధి కోర్సుల సంచాలకులు డాక్టర్ ఆర్.మాల్యాద్రి అధ్యక్షత వహించి ప్రసంగించారు. కార్యక్రమంలో డైరీ సైన్స్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ డాక్టర్ జి.రమణారెడ్డి, అలాగే అధ్యాపకులు డాక్టర్ బి.అమరావతి, వి.దుర్గాశంకర్, సి.హెచ్.ప్రత్యూష, ఇంకా అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన

ప్రజాశక్తి-కావలి : కావలి రూరల్ మండలం గౌరవరం బి.సి.అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం కేంద్రంలోని చిన్నారుల తల్లిదండ్రులకు ఐ.సి.డి.ఎస్. ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "పూర్వ ప్రాథమిక విద్యపై అవగాహనా కార్యక్రమం" నిర్వహించారు. కార్యక్రమానికి ఐ.సి.డి.ఎస్. సి.డి.పి.ఒ. కె.సౌజన్య, సూపర్‌వైజర్ ఎ.విజయలక్ష్మి ముఖ్య అతిథులుగా పాల్గొని, చిన్నారులకు ఇక్కడే ఒకటో క్లాస్ నేర్చుకునే పూర్వ ప్రాథమిక విద్యను ప్రస్తుతం ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా తెలుగు, ఇంగ్లీష్ భాషలలో ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ అందజేస్తున్నారని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త వి.వి.రమణమ్మ, ఎ.ఎన్.ఎం.మాధవి, కేంద్రంలో చదివే చిన్నారుల తల్లిదండ్రులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

రమణయ్య కుటుంబానికి ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి-దుత్తలూరు : ఎంఆర్‌పిఎస్ సీనియర్ నేత యద్దనపూడి రమణయ్య ఇటీవల కాలంలో హఠాత్తుగా మరణించడంతో బుధవారం ఎంఎల్ఎ కాకర్ల సురేష్ ఆ కుటుంబాన్ని పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం ఎంఎల్ఎ మాట్లాడుతూ ఎంఆర్‌పిఎస్ నేతలు కూటమి ప్రభుత్వ గెలుపులో ఎంతో కృషి చేశారని, ఎప్పుడు ఏ అవసరం వచ్చిన నేను అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లెక్కల వెంకటరెడ్డి, లెక్కల మాలకొండారెడ్డి, చింతగుంపల కృష్ణచౌదరి, యద్దనపూడి నరసయ్య, సూరిపోగు మాధవ, ఎంఎస్‌పి జాతీయ నాయకులు గొల్లపల్లి శ్రీనివాస్ మాదిగ, ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు పందిటి అంబేడ్కర్ మాదిగ, బెజవాడ గురవయ్య మాదిగ, గొల్లపల్లి మోహన్ రావు మాదిగ, గోచిపాతల ఆనంద్‌రావు మాదిగ, తెలుగు యువత జిల్లా కార్యదర్శి అంకి పెద్దయ్య, మల్లెల తిరుపతిస్వామి మాదిగ, బర్రె అర్జున్ మాదిగ, గంగపట్ల నాగరాజు మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి-కావలి : హ్యాపీ సేవాసంస్థ ఆధ్వర్యంలో బుధవారం వెంగళరావు నగర్ 23వ వార్డుకు చెందిన ఆటోడ్రైవర్ బాబుల్ కుటుంబానికి బియ్యం, నిత్యావసర సరుకులు హ్యాపీ సేవాసంస్థ గౌరవ అధ్యక్షులు షేక్.ఖాదర్ బాషా అందజేశారు. కార్యక్రమంలో హ్యాపీ సేవాసంస్థ అధ్యక్షులు సయ్యద్. ఘనీబాషా, గౌరవ అధ్యక్షులు షేక్.ఖాదర్‌బాషా, ఉపాధ్యక్షులు దేవరకొండ.విజయ్, సంస్థ సలహాదారులు చేవూరు.ప్రభుద్య, రత్నమ్మ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు ఎం.వి.ఎస్. ప్రసాదరావు, షేక్.ఖాసిం వారి కుటుంబ సభ్యులు ఉన్నారు.

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి-ఉదయగిరి : వెంగళరావు నగర్ మెయిన్, ఉర్దూ పాఠశాలలను విద్యార్థులను ఎంఈఓ-2 శోట్ల శ్రీనివాసులు అభినందించారు. ఈ సందర్భంగా బుధవారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వెంగళరావు నగర్ మెయిన్, వెంగళరావు నగర్ ఉర్దూ పాఠశాలలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం అన్ని తరగతుల విద్యార్థుల అభ్యసన పఠన సామర్థ్యాలను పరిశీలించారు. ప్రాథమిక పాఠశాల వెంగళరావు నగర్ మెయిన్ పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలు వారి తరగతి స్థాయి కంటే మిన్నగా ఉన్నదున విద్యార్థులను ప్రధానోపాధ్యాయిని రఫిక్ సుల్తానాను అభినందించారు. అలాగే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పరిశీలించి, సంతృప్తి చెంది భోజన కార్మికులను అభినందించారు.

వెంకటయ్య మృతి బాధాకరం

ప్రజాశక్తి-సీతారామపురం : మండల టిడిపి కురువృద్ధుడు, మాజీ పిఎసిసి అధ్యక్షుడు, మాజీ సర్పంచ్, ఇలా ఎన్నో పదవులు అలంకరించిన టిడిపి నేత వెంగళశెట్టి వెంకటయ్య మూర్తి మృతి పార్టీకి తీరని లోటుని ఎంఎల్ఏ కాకర్ల సురేష్, వారి సోదరులు కాకర్ల వెంకట్, కాకర్ల సునీల్ తెలిపారు. బుధవారం వెంకటయ్య స్వగ్రామం సంగసానిపల్లికి విచ్చేసి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కప్ప ప్రభాకర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులు ముత్తంశెట్టి చెన్నకేశవులు, వరంగల్ శెట్టి వెంకటేశ్వర్లు, సీతారామపురం సర్పంచ్ కొండవీటి కంటి భాగ్యమూర్తి, ఎడమ ప్రవీణ్, కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ఆర్గనైజర్, ముత్తూరు సుమన్, నేలటూరి జాషువా, మదిన ఆదెయ్య, పోకల రామచంద్ర, తమ్మిశెట్టి వెంకటసుబ్బయ్య, నల్లి రామయ్య, గెంటెల శేఖర్, తురక వెంకటేశ్వర్లు, సోమనబోయిన రాజశేఖర్, జమ్ములమడుగు ఇజ్రాయెల్, తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు అందజేత

ప్రజాశక్తి-కావలి : సంయుక్త సేవాసంస్థ ఆధ్వర్యంలో 8వ తేదీన ప్రారంభం కానున్న ఉచిత కుట్టు శిక్షణ తరగతులకు బుధవారం కావలి పట్టణం వెంగళరావు నగర్ నివాసులు బి.వి.రత్నమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, విశ్రాంత లెక్చరర్ ఎంవిఎస్ ప్రసాద రావు రెండు కుట్టు మిషన్లను, ఇందిరా నగర్ నివాసులు వడ్డి వెంకటేష్ వారి సతీమణి వడ్డి.సంతోషమ్మ జ్ఞాపకార్థంగా ఒక కుట్టు మిషను అందజేశారు. ఈ సందర్భంగా సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ శిక్షణా తరగతులకు కుట్టు మిషన్లు అవసరమని తెలియజేసిన వెంటనే స్పందించి, కుట్టు మిషన్లు అందజేశారని తెలిపారు.

స్మార్ట్ సర్వేపల్లి సేవాసంఘ్ తోడ్పాటుతో బుధవారం "ఆల్గిడ్ హోప్ ట్రస్ట్" ద్వారా ట్రాన్స్ జెండర్లకు కుట్టు మిషన్ డాక్టర్ బైటన్ నిర్మల్ కుమార్ పంపిణీ చేశారు. ఈ ఉపాధి ద్వారా వారి జీవన విధానాలు మెరుగుపడుతాయని డాక్టర్ నిర్మల్ కుమార్ తెలియజేశారు. కార్యక్రమంలో జాషువా, జయప్రకాశ్, డాక్టర్ విజయవాణి, దిలీప్‌కుమార్, వినయ్ కుమార్, రూత్ బేనోమి మరియు కవిత, ప్రశాంతి, రూప, అనుష్క పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరపై అవగాహన

ప్రజాశక్తి-సంగం : మండలం దువ్వూరు రైతుసేవా కేంద్రంలో బుధవారం జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి రైతులతో సమావేశం నిర్వహించారు. గిట్టుబాటు ధరపై రైతులకు అవగాహన కల్పించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. రైతులకు గిట్టుబాటు ధర అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎడిఎ నర్సోజి, వ్యవసాయాధికారి శ్రీహరి, టిడిపి నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

సిపిడబ్ల్యుఎస్ స్కీమ్ పరిశీలన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మండలంలోని అప్పారావుపాళెంలో బుధవారం జిల్లా పరిషత్ సిఇఒ ఎం.విద్యారమ పర్యటించారు. అప్పారావుపాళెం నుండి మండలంలోని 14 గ్రామాలకు నీటి సరఫరా చేయాల్సిన సిపిడబ్ల్యుఎస్ స్కీమ్‌ను పరిశీలించారు. ప్రస్తుతం స్కీమ్ మరమ్మతులకు గురై వినియోగంలో లేనందున స్కీమ్ పునరుద్ధరించడానికి ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీరింగ్ అధికారులతో చర్చించి తగు సూచనలు చేశారు. 9వ తేదీ రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో శంకుస్థాపన జరగనున్న పంచాయతీరాజ్ అతిథి గృహాన్ని పరిశీలించారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. మండలస్థాయి అధికారులు పంచాయతీ కార్యదర్శులతో పలు పథకాలకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రాలను అన్ని గ్రామ పంచాయతీల్లో వినియోగంలోకి తీసుకు రావాలని, పరిశుభ్రమైన తాగునీరు అందించడానికి, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.


జెడ్‌పి సిఇఒకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపిపి కేత

ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి జిల్లా పరిషత్ సిఇఒకు విద్యారమకు పుష్పగుచ్ఛం అందచేసి సాదర స్వాగతం పలికారు. కార్యక్రమాలలో డిఎల్‌డిఒ రమణయ్య, ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్, ఆర్డబ్ల్యుఎస్ డిఇ మోహన్ రావు, ఎఇ ఆర్డబ్ల్యుఎస్, ఎఇపిఆర్, ఇఒఆర్‌డి, కార్యాలయ పరిపాలనాధికారి శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ కార్యాలయ పరిపాలన అధికారి రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది హాజరయ్యారు.

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలంలోని కొండమీదకొండూరు గ్రామంలో బుధవారం సిపిడబ్ల్యుఎస్ స్కీమ్‌ను ఎంపిడిఒ, ఆర్డబ్ల్యుఎస్ అధికారులతో కలిసి జిల్లా ప్రజాపరిషత్ సిఇఒ విద్యారమ తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆర్డబ్ల్యుఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లతో, స్థానిక ప్రజలతో, ప్రజా ప్రతినిధులతో, ముఖాముఖి నిర్వహించారు. తదనంతరం ఆమె పత్రికా విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు జిల్లాలో ఉన్న అన్ని సిపిడబ్ల్యుఎస్ స్కీమ్ తనిఖీ చేసి, వాటి పనితీరును నివేదిక కోరినందున, ఈ స్కీమ్ తనిఖీ చేసినట్లు తెలిపారు. స్కీమ్ పరిధిలో 13 నివాసిత ప్రాంతాలలో, ప్రతిరోజు తాగునీటి సరఫరా అందించాలని ఆర్‌డబ్ల్యు ఎఫ్ అధికారులకు సూచించారు. ఆర్‌డబ్ల్యు ఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రెడ్డయ్య, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మోహన్‌రావు, ఎంపి డిఒ ప్రసన్నకుమారి, అసిస్టెంట్ ఎగ్జిక్యూ టివ్ ఇంజనీర్ రవితేజ, విస్తరణ అధికారి రమేష్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో విచారణ

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

అనుమసముద్రంపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని స్టాఫ్‌నర్స్ లక్ష్మి కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదులో భాగంగా బుధవారం డిప్యూటీ డిఎంహెచ్ఒ విచారణకు హాజరయ్యా రు. ఈ సందర్భంగా ప్రాథమిక కేంద్రంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన స్టాఫ్‌నర్స్ లక్ష్మి పత్రిక విలేకరులతో మాట్లాడుతూ మూడు రోజులు సెలవులు అడగ్గా పబ్లిక్ డిస్టర్బ్ అవుతుందని చెప్పినట్లు, తనవల్లే పబ్లిక్ డిస్టర్బ్ అయితే తనకు సెలవులు ఎందుకు ఇచ్చినట్టు అని మీడియా ముఖంగా ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్లు సమ్మె పేరుతో 15 రోజులు విధులకు రాకుండా ఉన్నప్పుడు, పబ్లిక్‌కు డిస్టర్బ్ కాలేదా.. అని ఆమె ప్రశ్నించారు. అదే విషయాన్ని జిల్లా డిప్యూటీ డిఎంహెచ్ఒ బ్రిజితను వివరణ కోరగా ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న స్టాఫ్‌నర్స్ లక్ష్మికి సాధారణ సెలవులు ఇవ్వకుండా, అక్కడ పనిచేస్తున్న డాక్టర్ సురేష్‌బాబు వేధిస్తున్నారని, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విచారణ నిమిత్తం వచ్చినట్లు తెలిపారు. సైక్లోన్ అలర్ట్ చేసి ఉన్నారు కావున తాను లీవ్ ఇవ్వలేనని డాక్టర్ సురేష్ చెప్పారని,



ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ముగ్గురు స్టాఫ్‌నర్స్‌లు పనిచేస్తున్నారని, ఒక అమ్మాయి డిప్యూటేషన్‌లో ఉందని, ఒకరేమో నైట్ డ్యూటీలో ఉన్నారని, లక్ష్మీ డే డ్యూటీ కాబట్టి లీవ్ ఇవ్వడం కుదరదని, డాక్టర్ చెప్పారని తెలియజేశారు. తనకు తప్పనిసరిగా లీవ్ ఇవ్వాలని లక్ష్మి కోరడంతో సైక్లోన్ అలర్ట్ చేస్తున్నారన్నారు. డెంగీ కేసులు ఉన్నాయి కాబట్టి మెడికల్ క్యాంపు నిర్వహించాల్సి వస్తుందని, డాక్టర్ సెలవివ్వడానికి ఒప్పుకోలేదని విచారణలో తెలియజేశారని డిప్యూటీ డిఎంహెచ్ఒ తెలియజేశారు. ఒక స్టాఫ్‌నర్స్ డ్యూటీలో లేకపోయినా జీతం మంజూరు చేశారని లక్ష్మి ఫిర్యాదు చేసి ఉందని, దానిపైన కూడా వివరాల సేకరించి, జిల్లా అధికారులకు తెలియజేస్తామ న్నారు. ఈ విచారణలో డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



'శాంతినికేతన్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-అనంతసాగరం

జిల్లాస్థాయి టాలెంట్‌టెస్ట్ పోటీల్లో శాంతినికేతన్ విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. నెల్లూరు టౌన్ హాల్‌లో జరిగిన మనోహర్ రెడ్డి మెమోరియల్ జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చూపి, ఎంఎల్‌సి పర్వతనేని చంద్రశేఖర్ రెడ్డి, అపస్మా రాష్ట్ర అధ్యక్షులు తులసి విష్ణు ప్రసాద్, రాష్ట్ర సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ నేతాజీ సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షులు ఎన్.శ్రీధర్ చేతుల మీదుగా మొదటి బహుమతి బట్రెడ్డి లహరి, మూడో బహుమతి చల్లా అనన్య, కాకూరు వర్షిణి బహుమతులు అందుకున్నారు. ఇంతటి విజయాన్ని సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు, కరస్పాండెంట్ జి.ప్రభాకర్, డైరెక్టర్ పి.నరసింహులు, హెడ్మాస్టర్ ఎం.భువనేశ్వరి అభినందించారు.

బీమా ఉద్యోగుల నిరసన



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపుమేరకు బుధవారం ఎల్ఐసి కార్యాలయంలో ఉద్యోగులు భోజన విరామ సమయంలో ఎఫ్‌డిఐకి వ్యతిరేకంగా నినాదాలు చేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు టి.రమేష్, కార్యదర్శి శ్యామ్‌ప్రభాకర్ మాట్లాడుతూ ఎఫ్‌డిఐలు 74శాతం నుండి 100శాతంకు పెంచడం సరికాదని, దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందన్నారు. ఎల్ఐసి ప్రీమియంపై జిఎస్‌టిని రద్దు చేయాలని, 3, 4, తరగతుల రిక్రూట్‌మెంట్ వెంటనే జరపాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో క్లాస్-1, క్లాస్-2, అధికారులు సాయితేజ, నందగోపాల్, ఆఫీస్ సిబ్బంది, ఏజెంట్ మిత్రులు పాల్గొన్నారు.

జామాయిల్ నరికివేతను ఆపాలి


పరిశీలిస్తున్న అంకయ్య

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలోని కడియంపాడు రెవెన్యూలోని అగ్రిగోల్డ్ భూముల్లో జామాయిల్ అక్రమ నరికివేతను సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య బుధవారం పరిశీలించారు. కొంతమంది అక్రమార్కులు అక్రమంగా జామాయిలు తరలించుకొని పోతున్నారని గుర్తించి అధికారులు చర్యలు తీసుకోలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తహశీల్దార్ హేమంత్ కుమార్‌కు అగ్రిగోల్డ్ భూముల్లో ఉన్న సంపదను ఎవరూ తరలించకుండా తగిన చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. ఆయన పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని వారికి భరోసా ఇచ్చారు.

సచివాలయంలో రికార్డులు తనిఖీ

ప్రజాశక్తి-కొడవలూరు : నార్త్ రాజుపాలెం సచివాయాన్ని బుధవారం జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి మోహన్‌రావు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించారు. ప్రజలకు ప్రభుత్వపరంగా అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఇండస్ట్రీస్ సర్వే సిటిజన్ మిస్సింగ్ సర్వే అక్షరాస్యత సర్వేల గురించి సచివాలయం సిబ్బంది ప్రశ్నించారు. ఎంపిడిఒ వెంకటసుబ్బారావు, ఎఒ రాంప్రసాద్, ఇఒపిఆర్‌డి సాయిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి విజయ, తదితరులున్నారు.

పాఠశాలల విలీనం వద్దని ఆర్‌డిఒకు వినతి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : నువ్వూరుపాడు పంచాయతీలోని జంగాలపల్లి గ్రామస్తులు 3,4,5 తరగతులను అశ్వినిపురం ఎంపిపిఎస్ పాఠశాలకు మార్చొద్దని జంగాలపల్లి గ్రామస్తులు బుధవారం ఆర్‌డిఒ పావనికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మాట్లాడుతూ జంగాలపల్లి పాఠశాల విద్యార్థులను అశ్వినీపురం గ్రామ పాఠశాలకు 3, 4, 5 తరగతులను మార్చి మా పిల్లలను ఇబ్బందులకు గురి చేయవద్దని తక్షణమే విరమించుకోవాలని కోరినట్లు పాఠశాల విద్యార్థులు తల్లిదండ్రులు తెలిపారు.

సంగంలో కార్డెన్‌సెర్చ్

ప్రజాశక్తి-సంగం : సంగంలోని తిరమనతిప్ప ఎస్‌టి కాలనీలో బుధవారం డిఎస్‌పి వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఇద్దరు సిఐలు, నలుగురు ఎస్ఐలు, 45మంది సిబ్బంది ముమ్మరంగా కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. సుమారు 400ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి, అనుమానాస్పద వ్యక్తుల వివరాలు, నేరాలకు పాల్పడిన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలు వాహనాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. సంగం, ఆత్మకూరు సిఐలు వేమారెడ్డి, గంగాధర్, సంగం, చేజర్ల, అనంతసాగరం, మర్రిపాడు ఎస్ఐలు రాజేష్, తిరుమలరావు, సూర్యప్రకాష్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పాఠశాలల విలీనం ఆపాలని ఆందోళన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్


స్కూల్ ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

మండలంలోని నాగులపాడు గ్రామంలోని పాఠశాలలో 1 నుండి 5 తరగతులను అలాగే కొనసాగించాలని, అలా కాకుండా 3, 4, 5 తరగతులను తరలించి విద్యార్థులను చదువులకు దూరం చేయవద్దంటూ బుధవారం పాఠశాల ఎదుట గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిఒ 117ను ఉపహరిస్తూ విడుదల చేసిన ఉత్తర్వుల మేరకు నాగులపాడు ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను చెర్లోయడవల్లి ప్రాథమిక పాఠశాలలో కలిపి ఆ పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా మార్పు చేసేలా ప్రణాళికలను సిద్ధం చేసిందని, కానీ నాగులపాడు ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులతో అన్ని వసతులతో చక్కగా విద్యాబోధన సాగుతుందన్నారు. ఇక్కడి నుండి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న చెర్లోయడవల్లి పాఠశాలకు విలీనం చేయడం ద్వారా విద్యార్థులు చదువులకు దూరమవుతారనిత తెలిపారు. అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, యథతథంగా పాఠశాలలో తరగతులు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు.

ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి కోవూరు


మాట్లాడుతున్న ఎంఎల్ఎ ప్రశాంతిరెడ్డి

మెరుగైన వైద్య సేవలు అందివ్వటంతో పాటు ప్రజలకు ఆరోగ్య సంబంధిత విషయాలపై అవగాహన కల్పించాలని ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి డాక్టర్లను కోరారు. హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ హోదాలో కోవూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొన్నారు. అటెండెన్స్ రిజిస్టర్ తెప్పించుకొని డాక్టర్లు ఇతర వైద్య సిబ్బంది హాజరును పరిశీలించారు. కోవూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో అందిస్తున్న వైద్య సేవలు గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మార్చురీలో మృతదేహాల భద్రపరిచేందుకు ఫ్రీజర్ లేదన్న విషయాన్ని తెలుసుకొని విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ఆసుపత్రికి కావాల్సిన ఫ్రీజర్, వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తానని హామీనిచ్చారు. మెడిసిన్ కొరత లేకుండా చూసుకోవాలని ఫార్మాసిస్టుకు సూచించారు. గత కొన్ని నెలలుగా సెలవుల్లో ఉన్న గైనకాలజిస్ట్ స్థానంలో వీలైనంత త్వరగా కొత్తవారి నియమకానికి సంబంధించి ఉన్నతాధికారుల దృష్టికి తేవాలని కోరారు. అత్యవసర వైద్య సేవలకు నైట్‌షిఫ్ట్‌లో వైద్య సిబ్బంది తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. కార్యక్రమంలో కోవూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపర్డెంట్ డాక్టర్ వెంకటాచలపతి గౌడ్, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు మల్లికార్జున్‌రెడ్డి, కోవూరు సర్పంచి విజయ వేగూర్ సర్పంచి అమరావతి, మాజీ ఎంపిపి యాకసిరి వెంకటరమణమ్మ, మైనార్టీ నాయకులు జహంగీర్, సూరిశెట్టి శ్రీనివాసులు, నాటకరాణి వెంకట్, బాలరవి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి-కోవూరు



పూర్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యాబుద్ధులు అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను మరింత ఆదర్శవంతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలపై ఉందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి అన్నారు. కోవూరు పంచాయతీ పరిధిలోని పెళ్లకూరు కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భం దాల్చినప్పటి నుంచి పుట్టిన బిడ్డ వరకు అక్కడి నుంచి 3 సంవత్సరాల వరకు ఆ ఇంటితో అంగన్‌వాడీ కార్యకర్తకు పూర్తిస్థాయిలో అవినాభావ సంబంధాలు ఉన్నాయని, బిడ్డకు 3 సంవత్సరాలు వచ్చిన తర్వాత ఎందుకు అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించరు అని వారిని ప్రశ్నించాలన్నారు. తమ కేంద్రానికి బిడ్డలను స్వయంగా ఆయా తీసుకువెళ్లి, మళ్లీ తీసుకొచ్చి ఇంటి దగ్గర సురక్షితంగా వదిలిపెడుతుందని, దానికి తోడు ఉదయం పాలు, బలవర్ధకమైన ఆహారం కూడా అందిస్తున్నామని ఈ విషయాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించేలా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తగు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రాజెక్టు డైరెక్టర్ గంగాభవాని, సిడిపిఒ జ్యోతి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాధిక, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

రీసర్వే పరిశీలన



ప్రజాశక్తి-కోవూరు : కోవూరు పంచాయతీలో బుధవారం జరుగుతున్న రీ సర్వే కార్యక్రమాన్ని ఆర్‌డిఒ నాగసంతోష్ అనూష ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రీ సర్వే కార్యక్రమాన్ని నిశిత పరిశీలన చేపట్టారు. ప్రస్తుతం జరుగుతున్న రీ సర్వే కార్యక్రమానికి రైతులు పూర్తిస్థాయిలో సహకరించి తమ భూములకు సంబంధించిన సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం కోవూరు పంచాయతీ పరిధిలోని నందలగుంటలో జరుగుతున్న ఈ క్రాఫ్ట్ నమోదును ఆమె ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు తాము సాగు చేసిన పంటను ఈ క్రాఫ్ట్‌లో నమోదు చేసుకోవడం వల్ల వారికి అనేక ఉపయోగాలు ఉన్నాయన్నారు. ప్రకృతి వైపరీత్యాల దృష్ట్యా వంటకు ఏమైనా నష్టం జరిగితే ఈ క్రాప్ నమోదు వల్ల తిరిగి వారు నష్టపరిహారం పొందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ నిర్మలానంద బాబా, మండల సర్వేయర్ రమేష్ గౌడ్, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ మధుసూదన్‌రావు, గ్రామ వ్యవసాయ సహాయకులు చైతన్య, మెహరున్నీసా ఉన్నారు.

8న మద్యం షాపులకు తుది గడువు

ప్రజాశక్తి-ఉదయగిరి

రాష్ట్ర ప్రభుత్వం కల్లుగీత కార్మికుల మద్యం షాపులు కేటాయిం చిందని 8వ తేదీ వరకు గడువు పెంచిందని ప్రొహిబిషన్ సిఐ తన్నీరు లక్ష్మణస్వామి తెలి పారు. బుధవారం ప్రొహిబిషన్ కార్యాలయం లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో దుత్తలూరు మండలంలో ఒక మద్యం షాపును ప్రభుత్వం గీత కార్మికులకు కేటాయిం చిందని, ఆ షాపునకు 4 దరఖాస్తులు వచ్చా యని షాపులకు దరఖాస్తు చేసుకునే వారు గౌడ (జిఒడబ్ల్యుడిఎ) కులస్తులై ఉండాలన్నారు. తహశీల్దార్ నుండి జిఒడబ్ల్యుడిఎ ఉండేలా తీసుకురావాలని కుల ధ్రువీకరణలో కొద్దిపాటి తప్పులు ఉన్న దరఖాస్తులు తిరస్కరించ బడతాయని తెలిపారు. ఆసక్తి గలవారు రెండు లక్షల డిపాజిట్‌తో ఆన్లైన్లో కుల ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 9న తేదీన దరఖాస్తులు పరిశీలిస్తామన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సుకుమార్ రెడ్డిని సస్పెండ్ చేయాలని డిమాండ్

ప్రజాశక్తి-కావలి

సుకుమార్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డిని కావలి నియోజకవర్గ వైసిపి నేతలు బుధవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. కావలిలో వైసిపి నాయకులు సుకుమార్ రెడ్డి తీరు బాగోలేదంటూ, పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డికి తెలపాలని వేడుకొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ అక్రమ లేఅవుట్ల రూపంలో సంపాదించుకుని, మాజీ ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై నిందలు మోపడం తమకు నచ్చలేదంటూ తెలియజేశారు. టిడిపి నాయకులతో కుమ్మక్కై తన అక్రమ లే అవుట్లు కాపాడుకోవడానికి కేవలం ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై ఆరోపణలు చేస్తున్నాడన్నారు. అంతేకాకుండా కావలి నియోజకవర్గంలో వైసిపి నాయకుల మధ్య చిచ్చు రేపుతున్నాడని, ఇవన్నీ తమకు సమ్మతంగా లేవని, తక్షణమే సుకుమార్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

కార్మికులకు వస్తువులు అందజేత

ప్రజాశక్తి-కావలి

కావలి పురపాలక సంఘం ప్రజారోగ్య విభాగంలో అవుట్ సోర్సింగ్ కార్మికులుగా పనిచేస్తున్న వారికి ప్రతి సంవత్సరం ఇచ్చే కొబ్బరి నూనె, సబ్బులు, చెప్పులను బుధవారం కావలి పురపాలక సంఘ కార్యాలయంలో కావలి మున్సిపల్ కమిషనరు జి.శ్రావణ్ కుమార్ అందజేశారు. కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే పట్టణ అభివృద్ధి జరుగుతుందన్నారు.

సిపిఎం నాయకుడు మృతి

ప్రజాశక్తి-బిట్రగుంట



మండలంలోని అల్లిమడుగు పంచాయతీ తెల్లగుంట గ్రామంలో సిపిఎం కార్యకర్త కావేటి బాలయ్య బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహానికి సిపిఎం సీనియర్ నాయకులు పులిగండ్ల శ్రీరాములు, జిల్లా కమిటీ సభ్యులు శ్రీరాములు, మాల్యాద్రి, మండల కార్యదర్శి తుమ్మల వెంకయ్య పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1990 నుంచి పార్టీలో ఉంటూ పార్టీ కోసం నిరంతరం పనిచేస్తూ పార్టీ అభివృద్ధి కోసం గ్రామ సమస్యల కోసం పోరాటం చేసిన నాయకులు వారు చనిపోవడం బాధాకరమన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గడ్డ వెంకయ్య, కాటయ్య, పాశం శేషాద్రి పాల్గొని నివాళులర్పించారు.

రేపు 'గ్రంధి' విగ్రహానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-కావలి : ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం మాగుంట పార్వతమ్మ రోడ్డులోని శ్రీ పొట్టి శ్రీరాములు సెంటర్‌లో ఆర్యవైశ్య ముద్దుబిడ్డ, కావలి మున్సిపల్ మాజీ చైర్మన్, ఎఎంసి మాజీ చైర్మన్ గ్రంధి యానాదిశెట్టి కాంస్య విగ్రహ శంకుస్థాపన జరుగుతుందని గ్రంధి కుటుంబ సభ్యులు తెలిపారు. కావున గ్రంధి అభిమానులు, ఆర్యవైశ్య నాయకులు, కూటమి నాయకులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.



ఈతల పోటీల్లో కోవూరు వాసి ఘనత

ప్రజాశక్తి-కోవూరు : విజయవాడలోని కృష్ణానదిలో ఫిబ్రవరి 2వ తేదీ నిర్వహించిన జాతీయస్థాయి ఈతల పోటీల్లో 60యేళ్లు పైబడిన విభాగంలో కోవూరుకు చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి జిల్లా స్థాయిలో మొదటి స్థానాన్ని, జాతీయస్థాయిలో ఐదవ స్థానం కైవసం చేసుకున్నాడు. ఈ విభా గంలో నెల్లూరు జిల్లా నుంచి 39 మంది పాల్గొ నగా శ్రీనివాసులు జిల్లా స్థాయిలో మొదటి స్థానాన్ని, జాతీయ స్థాయిలో ఐదవ స్థానం కైవసం చేసుకోవడంపై సహచర మిత్రులు, బంధువులు ప్రత్యేకంగా అభినందించారు.

పలుచోట్ల 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-విడవలూరు : మండల పరిధిలోని అలగనపాడు, ముదివర్తి గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి సుజాత ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ వారిలో ఎలుకల నివారణకు తప్పనిసరిగా బ్రో మూడోలిన్ అనే ముందును నాలుగు కేజీల నూకలతో కలిపి చిన్న చిన్న ప్యాకెట్లుగా కట్టి ఎలుకల బుర్రిలి వద్దా ఉంచాలని ఎడిఎ సుజాత తెలిపారు. వ్యవసాయ అధికారి వెంకట కృష్ణయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి-దుత్తలూరు : పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆహారం, పోషణ భద్రతా పథకం ద్వారా శనగ పంటను కెవిఎ శాస్త్రవేత్త డాక్టర్ డి విజయ్ కుమార్ నాయక్, డిఆర్‌సి నెల్లూరు ఎఒ యు.గీత కుమారి, వ్యవసాయ అధికారి ఎన్.వెంకట సుబ్బారెడ్డి సందర్శించారు. శనగ పంటలో వేప సంబంధిత మందును పిచికారి చేయాలని కూడా సూచించారు.

ప్రజాశక్తి-కొడవలూరు : మండలంలోని యల్లాయపాలెం గ్రామంలో బుధవారం మండల వ్యవసాయ అధికారిణి సిహెచ్ఎస్ లక్ష్మి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు సాగు చేస్తున్న భూమిని పంట నమోదు చేయించుకోవాలని తద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ పి.వెంకట్రావు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ జి.ఉమామహేష్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని సంజీవనగర్, అనంతసాగరం-1 గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం మండల వ్యవసాయాధికారి శ్రీధర్ రెడ్డి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు దేవసేనమ్మ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వారు రైతు సోదరులకు సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం కింద బ్రోమడయోలిన్ 0.25శాతం మందును రైతు సేవా కేంద్రాల ద్వారా ఉచితంగా పంపిణీ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, కేత శ్రీనివాసులు రెడ్డి, యశోద, సుబ్బయ్య, నాగేంద్ర, మైమున్నీసా, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

రైల్వేజోన్ ఏర్పాటుపై హర్షం

ప్రజాశక్తి-కావలి : కేంద్రం ప్రభుత్వం విశాఖ కేంద్రంగా సౌత్ కోస్టల్ రైల్వేజోన్ ఏర్పాటుకు ఉత్తర్వులు ఇవ్వడం చాలా హర్షనీయమని రైల్ అండ్ రోడ్, పాసెంజర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కూనం తాతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం వారు మాట్లాడుతూ సౌత్ కోస్టల్ రైల్వేజోన్ పరిధిలోకి విశాఖ, విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్లు సౌత్ కోస్టల్ రైల్వే జోన్ పరిధిలోకి తీసుకుని రావడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు కూడా ఒక రైల్వేజోన్ ఏర్పాటు అయినందున, రాష్ట్రంలో రైల్వే అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. రాష్ట్ర ప్రజల చిరకాల కోరికను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నెరవేర్చినందుకు హర్షం తెలియజేస్తున్నామన్నారు.

స్థల పరిశీలన

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : అనుమసముద్రం పంచాయతీలో ఇళ్ల స్థలాలకు సంబంధించిన స్థలాన్ని సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి వాసవి సతీష్‌బాబు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత గవర్నమెంట్లో ఇచ్చిన ఇళ్లస్థలాలను, జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు, తనిఖీ చేసినట్లు తెలియజేశారు. ఆయనతోపాటు జాయింట్ క్వాలిటీ కంట్రోల్ అధికారి ఖలీల్, ఉపాధి హామీ ఎపిఒ సునీల్‌కుమార్, ఇసి రవి, టిఎ రవీంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇళ్ల స్థలాల లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.